## పెద్ద కథ ప్రారంభం!

**గోపాలం యిలా చెయ్యడం ఇది తొలిసారి కాదు.**

**మాటాడకుండాయిదివరకు రెండుసార్లు మాయమైపోయాడు కదా!**

ఒకసారి పెళ్లాం పాండ్సు వేనిషింగ్ క్రీమ్ తెమ్మంటే కోల్డు క్రీమ్ తెచ్చాడని విసవిసలాడి విసిరికొట్టిందని ఆ సాయంత్రం యింటినించి వెళ్లిపోయినవాడు, మరుచటి రోజు సాయంత్రం వరకు తిరిగి యింటికి రాలేదు.



**ఇంకోసారి యే సినిమాకెళ్లావని మామగారు అడిగితే ఒక మళయాళం సినిమాకని నిజం చెప్పేసాడు.**

**ఇద్దరి యెదిగిన బిడ్డల తండ్రి! అలాంటి కామలీలల సినిమా చూడ్డానికి సిగ్గులేదూ! ఈ సుత్తి మామగారితో పాటు పెళ్లం నెత్తిమీద వెయ్యగానే రెండు రోజులు యింట్లో గైరు హాజరు.**

ఈ మూడో సారి అలాగే వస్తాడనుకుంటే మూడు రోజులైనా ముఖం కనపడలేదు. తండ్రి మీద కూతురు, కూతురు మీద తండ్రి రెండు రోజులు మౌనంగా యేవేవో అనుకున్నా మూడో రోజు కూతురు బైటకు ఒక మాట అనేసింది.

"అదుక్కు తినేవాడి ఆలి అయ్యేకన్నా, భాగ్యవంతుని బానిస అయితే మేలంటారు."

ఈ మాటలో అంతరార్థం గ్రహించిన తండ్రి "ఉత్తముడని కట్టిపెట్టాను గానీ ఉచితంగా వచ్చాడని కట్టబెట్టలేదు."

మూడో సారి పారిపోయే ముందు జరిగిన సంఘటన యేమిటంటే ఆఫీసు నుంచి యింటికి రాగానే మామ సదాశివరావు గోపాలంను నిలదీసి అడిగేడు.

"నీవు ప్రావిడెంట్ ఫండు నించి మూడువేలు అప్పు తియ్యడం నిజమా?"

"నిజం"

"ఎందుకు తీశావ్?"

"పెళ్లం జబ్బు కుదర్చటానికని మిష పెట్టి తీసాను "

"నాకా జబ్బు? మికా జబ్బు?" పెళ్లం ఖనేల్మంది.

"కళ్ళు సరిగ్గా విప్పి చూడవోయ్. అది జబ్బు మనిషిగా వుందా?" అని మామగారంటే

"ఒకసారి అద్దం యెదరగా నిల్చొని అఘోరించండి. ఎవరి ముఖాన రోగం మూలుగుతోందో తెలుస్తుంది". అంది భార్య పావని తన బంగారు రంగు బుగ్గలను పొంగిస్తూ.

గోపాలం సహజంగా వెలిగించే చిరునవ్వును వొలగబోసాడు. ఆ నవ్వుతో ఆమెకు తేలు కుట్టినట్లయి గెంతి

"ఆ డబ్బు ఎక్కడ దాచారో వేగం తెచ్చి యివ్వకపోతే ..."

ఈ జడిపింపుకూ నవ్వేసాడు.

"నవ్వితే వూరుకుంటాననా? అందులో నా పెర్మిషన్ లేకుండా ఒక్క రూపాయి ఖర్చుపెట్టారంటే చూడండి మీకూ నాకూ ఈసారి గట్టిగా వస్తుంది"

మళ్ళీ అదే నవ్వు.

"తిక్క తిగులుగాని వచ్చిందా?" పావని అనగానే

"అమ్మాయి అదేదో వచ్చినట్లుందే! నా యింట్లో వుండి నా దగ్గిరే యింత దాపరికం చేస్తాడని కలలో కూడా అనుకోలేదు. ఎన్నాళ్లనించి, యిలాంటి దాపరికాలు చేస్తున్నాడో?"

"వీధిలో వారాలు చేస్తూ చదువుకుంటున్న వాడిని యింట్లో పెట్టుకున్నారు! పెట్టుకుని నేను చెల్లనట్లు నన్ను కట్టిపెట్టి యిల్లరికం తెచ్చుకున్నారు. మా అమ్మే వుంటే నా ఒక్కగాని ఒక్క కూతుర్ని ఒక జమిందారింట్లో వేస్తారా లేదా అని పోరు పెట్టేదే? పడండి ... పడండి" అంటూ పావని యేడుస్తుంటే

"డబ్బు గురించి కాదు - ఇది తిరుగుబాటు. నేను భరించలేను. నా రెవిన్యూ సార్వీసులో నామీద ఇలాఎవ్వడూ తిరుగుబాటు చెయ్యలేదు. ఈనాటికి యింట్లో నావల్ల చదివి నా వల్లనే ఉద్యోగం సంపాదించి నామీదే తిరుగుబాటు చేసాడు. ఈ అవమానం భరించలేను."

అల్లుడు మళ్ళీ చిరు నగవే

"చెప్పు ఆ డబ్బు ఏం చేసావో చెప్పు!" అని నిలదీసి కొట్టడానికి వచ్చినట్లు మామగారూ, ఏడుపు నాపి రేసుగుర్రంలా మీదికి వచ్చిన పెళ్లం ఇద్దరి వేపు ఒకసారి చూసి

"లెఖ్ఖలు తరవాత చెప్తాను" అని మారుమాటాడకండా వూరుకున్నాడు ఈలోగా తండ్రీ కూతుళ్లిద్దరు కిర్రెత్తి యేవేవో మాటలు గోపాలాన్ని అనేసారు తల్లిని అనుసరించాడు పదిహేనేళ్లకొడుకు. అన్న, అమ్మ అంటున్నారని పదేళ్ల కూతురు గొంతు కలిపింది ఈ తిట్ల కత్తితో తల గొరిగినా, తలపులు బోడి కాకపోవడంతో తాడు తెంచుకున్న గుఱ్ఱంలా తెల్లారేసరికి యింట్లో కనపడలేదు. మిల్కు బూతుకు వెళ్లి తేవలసినపాల పాకెట్లు రాలేదు.

ఉదయం లేచి యింట్లో అందరికీ 'టీ' కప్పులు అందిచ్చే గోపాలం లేకపోగానే అసలు వున్న మిగతా నలుగురూ నిత్రాణంగా కేకలు వేసేసారు ఏ కేకలకి జబాబు లేకపోవటంతో యేమైందని మామగారు



లేస్తే, మరెక్కడ గోపాలం? మూడో సారి అలక యిది అని అనుకుని మూడు రోజులు చూస్తే మనిషి కనపడడే! ఊర్లో వుంటే కనిపించేవాడే ఊరు వదలి యెక్కడకు వెళ్తాడు? ఆఫీసుకు ఫోను చేస్తే ఆఫీసుకు రాలేదట! ఎక్కడకు వెళ్లాడో?

ఈ మూడు రోజుల్లో యింట్లో కూరగాయలకు వాచిపోయారు. బజారుకి వెళ్లి బేరమాడటం గోపాలంకి తప్పించి యెవరికి తెలుసు? అంత పెద్ద యింట్లో ప్రతి ఆదివారం ఉదయం పట్లు దులిపి నీటుగా యింటిని వుంచిన వాళ్లింకెవరున్నారు? ఒక వారం చెయ్యకపోతే విసవిసలాడిన పెళ్లాం యీ ఆదివారం మొగుడు మీద కాదు యింట్లో వున్న తమ్ముడుమీద మాటలతో విరుచుకుపడింది అలా విరుచుకుపడడానికి కారణం ఆమె తండ్రే!

"కిందటిసారి వాసుండేవాడు. వెతికాడు " తండ్రి అనగానే "వాసు! వాడే ఇతగాడికి కొమ్ములిచ్చాడు అసలు యింటికి మేష్టారు మేష్టారు అని తెచ్చిందెవరు?

"వాడే .." అంది పావని.

"నా ఒక్కగాని ఒక్క కొడుకు ఒంటరిగా దూరాన వున్నాడు. వాడి మీద నిష్ఠూరం వెయ్యకు "

"గట్టిగా రాస్తాను"

"ఎంతమాత్రం రాయకు "

"ఎవరిళ్లలో నో అడుక్కుతిని వీధి లైట్ల కింద చదువుతూ పేవ్‌మెంట్ల మీద పడుకున్నవాడిని తెచ్చి

# బానిస బ్రతుకులు

నాన్నగారూ - మా స్కూల్లో మాష్టరు మూడుసార్లు చెప్పిన అర్థంకాని ఇంగ్లీషు పాఠం యీ గోపాలం గారు సదుస్తూనే సులువుగా బోధపర్చేసారు అబ్బో ఎంత బాగా పాఠ్తారనుకున్నావని ఈ పై పై మెరుగులకి చిన్నవాడు వాడు లొంగిపోతే మీరేమో సమ్మోహనం అయిపోయి యింట్లో పెట్టుకుని ."

'అబ్బబ్బ ఎన్నిసార్లు దెప్పుతావులెద్దూ? నెత్తిన నోరుపెట్టుకుని యిప్పుడరిస్తే పిల్లలనెక్కడ దాచేస్తావ్? గోపాలం నవ్వులో నిప్పుందని నేనెప్పుడైనా అనుకున్నానా? మనం కోపంతో విసిరితే నిప్పు రాజుకుంటుంది మంచి మాటలతో ఆ నిప్పుమీద మంచినీరు పొయ్యి

పావని తండ్రి యిలా అంటాడనుకోలేదు కొడుక్కి సమర్థించాడంటే ఒప్పుకుంది ఇందులో అల్లుడ్ని సమర్థిస్తున్నాడన్న అనుమానం వచ్చి, యీ చెడుకాలాన్ని చెరిగి వదలిపెట్టానని భీష్మించుకుంది చెడు కాలాన్ని తెచ్చినవాడు మొగుడు చెరిగితే వాడ్నే చెరగాలి అంచేత పొరుగు యింట్లో ఫోనుంది కదా! మొగుడు పనిచేసే ఆఫీసు పెద్దకేఫోను చేసింది

"గోపాలం డ్యూటీకి వచ్చాడా?"

'ఏ గోపాలం? ఇక్కడ వెయ్యిమంది పనిచేస్తున్నారు? మీకేమైనా తెలుసుకోవాలంటే మా ఆఫీసుకు వచ్చి పెరస్‌నల్ మేనేజర్ని కలవండి" అంటూ ఫోను పడేసాడు

"ఫీడో తిక్క వెధవలా వున్నాడు ఆ తిక్క గోపాలంకి అంటింది కామోసు ఇద్దరికీ తిక్క కుదురుస్తాను" అని యింకో రోజు ఆగింది గోపాలం రాలేదు ఊరి మధ్యలో యిల్లేమో? రణగణ ధ్వనులకు రెస్టు లేదు. పగలైతే యెండ. రాత్రయితే మెర్క్యురీ వేపర్ లైట్లు ఫోకస్ ఇంట్లో బెడ్‌రూమ్‌లో పడ్డ వెలుగుతో అర్ధరాత్రి మీద తెలివొస్తే తెల్లారిపోయిందనిపిస్తుంది. ఇన్నాళ్లు ఉదయం లేచేసరికి బాత్‌రూమ్ నించి గోపాలం కమ్మని గొంతుకతో ఆలాపించే గీతాలు వినపడేవి. ఇప్పుడు సిటీ బస్సుల గోల. ఇంటి ముందున్న చిన్న జాగాలో నే పూలకుండీలు అమర్చి, సాయంత్రం ఆఫీసు నించి రాగానే వాటి సేవ చేసేవాడు. ఇప్పుడు నాలుగు రోజులు ఆ సేవ కరువై ఆ పూలమొక్కలు ముఖాలు తేలవేశాయి


ఆఫీసుకు వెళ్లే ముందు యెందుకైనా మంచిదని ఆ పెర్సనల్ మేనేజరుకే ఫోను చేసింది.

'పది రోజులకు సిక్ లీవ్ పెట్టాడు " అని జవాబు రాగానే "అంతా అబద్ధం . "

"అబద్ధం అని ఎలా చెప్పగలరు?"


"ఎక్కడికో వెళ్లిపోయాడు. కనిపించలేదు "

"అయితే పోలీసు రిపోర్టు యివ్వండి " అని ఫోను దించేసాడు హలో హలో అంటే



# గడుసు లోకం

— బాపు




పలుకుతాడా?మూడుసార్లు మళ్లీ ప్రయత్నిస్తే నెంబరు యెంగేజిడ్.

"కావాలని రిసీవరు బయటపెట్టేసి వుంటాడు. సరే నేనే వెళ్తాను" అని బయలుదేరింది. ఆరు కిలో మీటర్లు ఆటో మీద వెళ్లి మొగుడు జీతం తెచ్చేస్తానని వెళ్తే.

"అప్పుడే శలవులో వుండగానే జీతం తీసుకుపోయాడు."

"శలవుల్లో వుండగా జీతం యివ్వచ్చా?"

"మీ స్పెషల్ ఆర్డరు లేకపోవటం వల్ల ఆపలేదు." అని నవ్వుతూ ఆ మేనేజరంటే కాస్త వేళాకోళం చేస్తున్నాడని స్ఫురించి "అది కాదండి. ఆ డబ్బు దగ్గిరుంటే యిల్లు చేరరని ..."

"ఇక్కడ ఆఫీసులో అతని మీద మాకేం కంప్లయింట్లు లేవు. నమ్మకంగా పని చేస్తున్నవాడు. సాధారణంగా శలవు తీసుకోని వుద్యోగి. అతనిని మేం ఏ విధంగా దండించలేం. ఇదేదో కుటుంబ కలహంలా వుంది. మీలో మీరు రాజీపడ లేకపోతే కోర్టుకు వెళ్లిపోండి" అని తన పనిలో నిమగ్నుడైపోయాడా మేనేజరు.

ఒక సాంప్రదాయ కుటుంబంనించి వచ్చిన స్త్రీపట్ల యింత వుదాసీనంగా ప్రవర్తించడం చూసి ఒళ్లు మండింది. కోపం కంట్రోల్ చేసుకోడానికి అలా కొరివిలాంటి కళ్లుపెట్టి అతని వేపు చూసింది. అతనొకసారి యీామె అందంవేపు చూసి ఆ కళ్లప్పచెప్పి చూసిన చూపుకు తలదించి తన పనిలో తను పడ్డాడు.

"ఆడదాన్ని చూస్తే రిమ్మతెగులు తెచ్చుకునే మగాళ్లకి ఆడవాళ్ల గోడు యేం అర్థం అవుతుంది? జీతానికి వచ్చి నా మీద యేదో చెడ్డ కబుర్లు చెప్పి వుంటాడు. లేకపోతే వీళ్ల ప్రవర్తన యిలా మారడానికి కారణమేమిటి? ఈ వారం కాకపోతే యింకో వారం రాడా? వస్తే వీధిలో కూర్చోబెట్టి యింటిని కాపలా కాయమంటాను. వీధిలో తిండి పెడతాను.... తక్కువ వాడికి తిక్క తెగులొస్తే తగిన వైద్యం చెయ్యలేనా?"

ఇలా తిరిగి వస్తూ అనుకుని యింటికి వచ్చేసరికి ఒక వార్త కొడుకు తీసుక వచ్చాడు.

"నాన్న బార్‌లో తాగటం చూసాడట!"

"ఎవరు చూసారురా?"

"మా క్లాసు అబ్బాయి నాన్నగారు."

"మీ క్లాసు అబ్బాయి నాన్నగారు తాగుతారా?"

"నాకు తెలీదు."

"ఏ బార్‌లో చూసారో అడిగావా?"

"లేదు."

"ఆ మొద్దు ముఖమే నీదనీ" కాస్సేపాగి "మీ క్లాసు అబ్బాయి యిల్లు తెలుసా?"

"తెలీదు."

"ఉష్! తెలీదని నా ప్రాణం తీసేస్తున్నావురా!"

"రేపు కనుక్కుంటానులే....."

"వాడు యెల్లుండిక్కానీ కబురు తేలేడు ఈలోగా అంతా వెచ్చబెట్టి యే కాలవలోనో దొర్లుతుంటాడు. రేపు స్కూలు నించి వాళ్ల యింటికి వెళ్లి యే బార్‌లో యెప్పుడు చూసాడో యెన్నిసార్లు చూసాడో అంతా వివరంగా కనుక్కుని రా."

"నివ్వొ రాకూడదూ?"

"ఏ ముఖం పెట్టుకుని వెళ్లమంటావురా?"

"ఏం? నివ్వు తాగలేదుగా!"

"మీ నాన్న యిలాంటి తగువులు పెట్టి తంతూ వుంటే... అతగాడ్ని కొలువున పెట్టి కొలచడం నాకు చాతగాదు. ఈ పంతం యేమిటో నేనూ చూస్తాను. నేను చెప్పినట్టు చెయ్యి." అని చివరకు కసిరేసింది

మరుచటి రోజు యింట్లో మరింత మురికి చేరింది తను యిలా కొట్టాడుతోందే గానీ. యితన్ని యింట్లో పెట్టుకుని యింత వరకూ తెచ్చిన తండ్రి వుదాసీనంగా వుండటం సహించలేక.

"ఒకసారి వూర్లో తిరిగి అతని చెవి పట్టుకుని యీడ్చి రావాలని అనిపించలేదా?"

"ఈ యెండలో నేనెక్కడ తిరగ్గలను? పోలీసు రిపోర్టు యిచ్చేస్తాను ఇంట్లో యేదైనా ఫోటో వుందా?"

"పోలీసు రిపోర్టు-పేపర్లో వెయ్యడం. ఫలానవాడి కొడుకు అనడానికి వాళ్లకు వూరాపేరా? ఉన్నారా చచ్చారా? ఫలాన వారి అల్లుడే అంటారు అంచేత మీరు వెతక లేకపోతే మనవాళ్ల నెవరికైనా బెత్తాయించండి "

"ఊర్లోనే వుంటే వెతకడం దేనికి?"

' అయితే మీరే యీ నాటకం ఆడిస్తున్నారా?"

"నివ్వేమిటి మాటాడుతున్నావో ఆలోచించే మాటాడుతున్నావా? ఊరంతా తెలిసిపోయింది ఇంట్లో నించి అల్లుడు పారిపోయాడని. చుట్టాలు మనిషోలా అనుకుంటున్నారు ఈ సిగ్గుతో నేను ఇల్లు కదలలేను. ఏం చెయ్యాలని తోస్తే అదే చెయ్యి. తాళాలన్నీ నీ దగ్గిరే వున్నాయ్ " అని అక్కడి నించి యింకో గదిలోనికి సదాశివరావు వెళ్లిపోయాడు

ఇన్నాళ్లూ ఆ గొంతు ధాటితో మొగుడి మీద దాడి చేసేది అతను లేకపోవటంతో ఆ ఆపలేని ధాటి యింకెవరి మీద ప్రయోగించలేక తండ్రి మీద ప్రయోగించగానే యింత పెద్ద సమాధానం వచ్చింది నోరు కట్టుకోడానికి ప్రయత్నిస్తుంటే ఆ కోపాగ్ని మనసును దహించి వేస్తోంది. తన అపురూపమైన అందానికి యీ సంఘటన ఒక మహమ్మారిలా వచ్చి మచ్చలను వదిలి వెళ్లినట్లనిపిస్తోంది. శాసించడమే అలవాటుపడ్డ జీవితంలో ఒక్కసారి ఒడుదుడుకులు వచ్చి శాసనాన్ని శిరసావహించి తల ఒగ్గినట్లు అనిపిస్తోంది

రెండో రోజు కొడుకు వార్త తీసుక వచ్చాడు. ఫలాన చోట నున్న బార్‌లో పదిహేను రోజుల క్రితం చూసాడట

"హమ్మయ్య – పదిహేను రోజుల క్రితమా? మొన్న కాదు కదా!"

"మొన్న కాదట!"

"అయితే డబ్బు అతని దగ్గరే వుంటుంది."

"అప్పులు చేసి తాగకూడదా?"

అసలు యితను యీ త్రాగుడు యెప్పుడు నేర్చాడు? ఇతగాడికి డబ్బెక్కడిది? ఇంతే జీతమని అంతా నా చేతపెట్టేవాడు. ఎవడో ఆ రోజుకే పట్టించి వుంటాడు ఒకసారి వెళ్ళి ఆ షాపు వాడిని కనుక్కుంటావా?"

"నివ్వూ రా ..."

"సరే పద అసలు సంగతి తెలుస్తుంది "

ఇద్దరూ కలిసి ఆటో లో అంత దూరం వెళ్ళారు. ఆ బార్‌లో దూరుతుంటే యెదరగా నున్న బస్సు స్టాపులో వాళ్ళు వింతగా వాళ్ళ వేపే చూస్తున్నారు అందులో వాళ్ళ చుట్టాలిద్దరున్నారు వాళ్ళను చూసినా చూడనట్టు ముఖం త్రిప్పి లోపలకు వెళ్ళింది పావని

"గోపాలం యిక్కడ తాగేవాడా?"

"ఎవరు మీరు?"

"వాళ్ళ అబ్బాయిని" అన్నాడు కొడుకు

"అవును తాగేవారు తాగి అచ్చంగా ఘంటసాలలా 'జగమేమాయ' పాడేవాడు '

"మీ కెంత డబ్బు బాకీ పడ్డాడు?" అడిగింది ఆమె

"అతను పెద్దమనిషి డబ్బు ముందుగా యిచ్చి మరీ తాగేవాడు."

"హెచ్చు తాగేవాడా? తక్కువ?

"మోతాదుగానే తాగేవాడు కానీ ఆ మధ్య ఒక రోజు తెగ తాగేసి తూలుతూ వెళ్ళిపోయాడు "

"నాలుగు రోజుల క్రితమా?'

"కాదు రెండు వారాల క్రితం

"అయితే యీ నాలుగు రోజుల్లో వచ్చి తాగలేదా?"

"ఆ వేళ నించి మరి రాలేదు అతను రాకపోవడం మాకెంతో వెలితిగా వుంది అతను పాడగా మళ్ళీ వినాలని వుంది ఎక్కడున్నారో కాస్త చెప్తారా?"

"వెతకండి ఎక్కడో పాడుతూ దొర్లుతూంటాడు

# బానిస బ్రతుకులు

అని ఖస్సుమని పావని బయటకు వచ్చేసింది ఆటో లో తిరిగి వస్తుండగా "నాన్నకు తాగుడు అలవాటు యిదివరకే వుందన్న మాట! నిన్ను పోల్చుకోలేదా అమ్మా?' అని కొడుకు అడిగితే –

"తాగిన కబుర్లు నా యెదరగా యెప్పుడైనా ఆడితే కదా పోల్చుకోడానికి! ఆ నవ్వులో అంత విషం – ఆ గుండెలో అంత దాపరికం వుందని యెన్నడూ అనుకోలేదు " అని ముఖం తిప్పేసింది

* * * * *

కూతురు ఉమ ఒక కబురు తెచ్చింది "అదే గిరల షర్టు ఆ నీలి పేంటుతో కనిపిస్తే నాన్న అనుకుని ముందుకు వెళ్ళాను అతని ముఖం చూస్తే కళ్ళద్దాలున్నాయి గానీ నాన్న కాదు "

"మరెవరు?" అంది తల్లి

"నాన్నకు సర్దార్జీలా గెడ్డం యెక్కడుంది?"

"మారువేషాలతో కూడా తిరుగుతున్నాడన్న మాట! తిరగనీ యెన్నాళ్ళు తిరుగుతాడో? ఈ పనులన్నీ చెయ్యడానికి యెవడినో ఒకడ్ని పెట్టుకుంటాలే!'


నీకేనా పౌరుషం? నేను పౌరుషంతో నే పుట్టాను పౌరుషంతో నే బతుకుతాను అన్నట్టు పావని యింట్లో గోపాలంని పిల్లలు తలచుకోకుండా చేస్తోంది


ఇంతలో ఒక విశేషం జరిగింది పావని మేటనీ సినిమాకు వెళ్ళింది. ఆట పూర్తి కాక ముందు ఒకసారి తల త్రిప్పి చూస్తే పైన బాల్కనీలో చూచాయగా మొగుడి ముఖం కనిపించింది వెంటనే బాల్కనీకి పరుగెత్తేదే ఇంతలో మంచి ప్రేమఘట్టం తెర మీద కుప్పిగంతులతో కూనిరాగాలతో ఆడుతుంటే ఆటువేపే ధ్యానం మళ్ళింది ఆట పూర్తయిన వెంటనే నలుగురి మధ్య చెప్పు తీసి కొట్టినట్టు అడుగుతాను పెద్ద కబుర్లాడితే చెప్పే విసిరేస్తాను. ప్రేమ ఘట్టం ముద్దుల మినహా అన్నిరకాల ఆవేశాలతో వుషారెక్కించి కొందరిచే విజిల్సు కొట్టించేసాయి. తిరిగి మళ్ళీ చూస్తే ఆ జాగాలో యెవరో ఆడది గోపాలం లేడు రూపురేఖలు గుర్తు పట్టలేని వెలుగులో చీర కట్టుకున్న విగ్రహం కనపడింది ఇంకో రసవత్తర ఘట్టం గుబాళింపు తెరపై పడగానే మళ్ళీ అటువైపు కళ్ళు మళ్ళినా మనసు మళ్ళలేదు వెనుతిరిగి చూస్తే పైన గోపాలం లేడూ ఆ ఆడదీ లేదు బయటకు చప్పున వచ్చేసరికి ఆటో కదిలిపోతోంది గోపాలం ప్రక్కన ఒక ఆడది కూర్చుంది. ఆమె తన అసూయ నిండిన కళ్ళకు కూడా వెగటుగా కనపడలేదు ఆమె పయ్యెద మీద వంగి పవ్వళించిన సామిలా మొగుడు ఆమెను పట్టుకుని కూర్చున్నాడు. పావనికి రెప్ప పడలేదు కాళ్ళు కదల్లేదు అయ్యోయ్యో అనలేదు కుయ్యో మొర్రో మనలేదు ఇంటి కొచ్చాక అంతవరకు రాజుకున్న కోపంతో

'మా చేతనైనట్టు – ఆడదాన్ని కిరాయికి తీసుకున్నాడు అది వీడి నరాల సత్తువ చూసి పకపక నవ్వి తలుపు ధడాలున వెయ్యదా? ఆ గుమ్మంలో పాడుతూ కూర్చుంటే దానికి ధనం పుట్టుందా? ఇతగాడి యెదరగా యింకొకడి ఒడిలో వాలుతుంది. అప్పుడు పీక పిసుక్కుంటాడా? కట్టుకున్న పెళ్ళాం కాదు ఓర్చడానికి? లోకానికి జడిసి భరించడానికి!'

ఇన్ని మాటల్లో కొన్నే బయటకు అనగలిగింది మరికొన్ని లోలోనే అనుకుంది ఇందులో ఒకటో ఆరో యింట్లో వున్న తండ్రికి వినిపించాయి కానీ అతనికేమో అర్థం కాలేదు అవసరమైతేనే మాట్లాడే ధోరణిలో యీమధ్య అతను పడ్డాడు అడిగితే అవమానంగా కూతురు మాటాడుతుందేమోనన్న భయంతో పూరుకున్నాడు

(ఇంకా ఉంది)



పెద్ద కథ

# బానిస బ్రతుకులు

## బలివాడ కాంతారావు

(గత సంచిక తరువాయి)

ఒక్కొక్కరోజూ గడుస్తుంటే పావనిలో పంతం పెరుగుతూ వస్తోంది. అడుక్కున్న వాడిలా వచ్చిన వాడికి మళ్ళీ అడుకున్నవాడిలా మార్చితే గానీ మళ్ళీ దాసోహం అనడని స్పష్టమైంది. చేతిలో డబ్బు లేకపోతేనే ఇతగాడి ఆటకట్టు.

ఆ ముండ యెవర్తో అది అప్పుడు చేరనివ్వదు. ఇతగాడి ఉద్యోగం వూడితే? ఎలా వూడుతుంది? రూల్సు ప్రకారం కుటుంబాన్ని అఖ్ఖర చెయ్యని వాడిమీద యేక్షను తీసుకోవచ్చుట! దానికి ఆమె ఒక అర్జీ దాఖలు చేయాలి. అంతవరకూ పోకండా అతగాడు యెన్నాళ్ళు సిక్ లీవ్ అని పెట్టగలడు? అప్పుడే నెల కావస్తోంది కదా! ఇంకా సిక్‌లో వుంటే, అతను సిక్‌లో లేడు, అతనికి యే జబ్బూ గిబ్బూ లేదు. తాగి బజారు ముండలతో తిరుగుతున్నాడని ఆ యజమానితో చెప్పితే పిలిపించి యింకో డాక్టరుచేత పరీక్ష చేయిస్తే భండారం బయట పడుతుందనుకుంది.

ఆ రోజే ఆఫీసుకు వెళ్తే గోపాలం డ్యూటీలోనే వున్నాడు. బయటకు పనిమీద యేవో వస్తువులు కొనుగోలుకు పంపించారట. పెర్సనెల్ మేనేజరుని కలుసుకుని యెంత కసితో చెప్పాలో అంతా చెప్పి.

"ఈ ఆటలన్నీ కట్టాలంటే నా ఒక్క కోరికని మన్నించండి"

"ఏంటి ఆ కోరిక?"

"అతని చేతికి జీతంతో సహా ఒక్క పైసా వెళ్ళకండా చూడండి."

"అది చాలా పెద్ద కోరిక. నెలంతా పని చేసి జీతం అతనిచేత పెట్టకపోతే చట్టరీత్యా నేను దోషి నవుతాను. మాచేత నైంది ఒక్కటే. మీ దగ్గరనించి కుటుంబాన్ని చూడటం లేదని రాత మూలకంగా వస్తే మేం అతన్ని పిలిచి చెప్పగలం. సరియైన సంజాయిషి లేకపోతే అతనిమీద క్రమశిక్షణ చర్య తీసుకోగలం."

"ఇవన్నీ చేసేసరికి నెలలు గడిచిపోతాయి. డబ్బు పాడు చేసుకుంటాడు. మనిషి చిక్కిపోతాడు."

"మీ రింత చెప్తున్నారు. మా కెవరికి నమ్మశక్యం కాకండా వుంది. ఈమధ్య గోపాలం యెంత యేక్టివ్‌గా వున్నాడో చూసాక మాకే ఆశ్చర్యంగా వుంది. అందుకే పర్చేజ్ సెక్షనులో పెట్టాం."

"డబ్బుతో పని జాగ్రత్త....."

"అతను కక్కుర్తి మనిషి కాదండీ."

"ఇంట్లో పెళ్లాం పిల్లలుండగా బజారు ముండతో తిరగటం కక్కుర్తి కాదూ? ఇంట్లో కాఫీ, టీ లుండగా వీధిలో తాగి కాలవలంట దొర్లటం నిజాయితీకి కొలబద్దా? మీరంతా అతగాడి పక్షం చేరి మాటాడుతున్నారు గానీ..... అతని కట్టుకున్న భార్య గోడు మీకు వినిపిస్తుందా?" కాస్త తెములుకుని–

"మీతో చెప్పి లాభం లేదు. పెద్దని ఒకసారి చూడనివ్వండి." అనగానే పర్సనెల్ మేనేజరు యింటర్‌కామ్‌లో పెద్దతో చెప్పగా పావనిని తీసుక రమ్మన్నాడు. ముందుగా అతను పెద్దతో వివరంగా యీ కేసు విషయం చెప్పాక, ఆమెను లోనికి రానిచ్చారు. యెదురుగా కూర్చో పెట్టి అతను నెమ్మదిగా–

"మీ కేసు అంతా తెలుసుకున్నాను. మీ బాధ నాకు అర్థం అయ్యింది. మీకు యెలాగైనా సహాయం చెయ్యాలని వుంది. అయితే భార్యా భర్తలకున్న సంబంధాలులానే యజమానికి వుద్యోగికి మధ్య కొన్ని సంబంధాలుంటాయి. మీరు భార్యా భర్తలుగా కొన్ని నియమాలు పాటించినట్లే మేం కూడా పాటిస్తాం. మీ ప్రధానమైన కోర్కె అతనికి డబ్బు అందకుండా చూడటం కదా?"

"అవునండి. డబ్బు చేత లేకపోతే గానీ భార్యాబిడ్డలు గుర్తుకు రారు.."

"ఈ వచ్చే జీతాల రోజున మీరు వచ్చేవరకు గోపాలంకు జీతం యివ్వను. మీరు వచ్చాక యిద్దరూ ముఖాముఖి మా పెర్సనల్ మేనేజరు యెదరగా మాటాడి యిద్దరికీ సమ్మతమైన ఒక నిర్ణయం తీసుకుందురు గాని..... ఆ వేళ వచ్చే ముందు ఒకసారి మా పెర్సనల్ మేనేజరుగారికి ఫోను చేసి మరీ రండి."

పెర్సనల్ మేనేజరు ప్రవర్తనకు యితని ప్రవర్తనకు తేడాను చవి చూసిన పావని యింటికి వచ్చాక తండ్రితో జరిగింది చెప్తూ, "నా వయసును దాటి నేను యంగ్‌గా కనిపిస్తుంటే, ఆ పెర్సనల్ మేనేజరు వయసుకు మించి ఓల్డుగా కనిపిస్తున్నాడు. అలా మ్రింగేసినట్లు నా వేపు చూస్తున్నాడు.

ఒక్క మాటకు ఔననలేదు. వాడే ఆఫీసును వుద్ధరించేస్తున్నట్లు. పీడి పోజులు మంద అని పెద్ద దగ్గిరికెళ్తే..... వయసుకు చిన్న వాడైనా యెదుటి వాళ్లను అర్థం చేసుకోవడంలో పెద్దవాడే..... ఈ జీతాల రోజున యేదో తేల్చేస్తానన్నాడు."

"సంతోషం" అన్నాడు తండ్రి.

* * * * *

"రెండు వారాల క్రితం తెగ తాగేసి తూలుతూ వెళ్లాడని" పావనితో బార్ వాడు చెప్పాడు కదా! ఆ రోజున ఆ రాత్రి మీద తెగ తాగిన గోపాలం నడుస్తూనే చావుల మదుం దాటి స్మశానానికి పోయే దారి తప్పి ఉత్తరానికి కదిలి యెత్తైన రైలు మార్గం పక్కన వున్న పుచ్చుల దొడ్డిలో కూలబడి పోయాడు.

ఆ రాత్రంతా ఓవర్‌టైం వుంది రానని యింట్లో చెప్పాడు కాబట్టి అధిక జీతం వస్తుందని పావని సంతోషంతో సరే నంది. అబద్ధం అది యిలా తాగడానికి కారణం ముందు రాత్రి జరిగిన సంఘటన. అది భార్యా భర్తల మధ్యనే జరిగింది. వయసొచ్చిన దగ్గరనించి మనసులో మన్మధుడు కావాలని కోరుకునే ఆడవాళ్ళు, రతీదేవి కావాలని కోరుకునే మగవాళ్ళు - ఆ కోరికతో పాటు మరికొన్ని జతపడని కోరికలు, కూడా కోరుకుంటారు. నెమ్మదైన మొగుడిలో భీమబలుడు వుండటం, నవ మన్మధు డుండటం అరుదే.

మనసులో కోరుకున్న దొకటి దొరికిన దింకొకటి అయ్యేటప్పుడు ఆ దొరికే వస్తువుమీద ఒక విధమైన యేహ్యాభావం యెంత కాదనుకున్నా మనసులో మానని గాయంలా వుంటుంది. దరి చేరడానికి వెళ్తే ఖస్సు బుస్సున్న పెళ్ళం వైఖరికి ఆ రాత్రంతా గోపాలం నిద్దర పోలేదు. ఆ మరుచటిరోజు రాత్రి పెళ్ళం యెత్తి పొడుపులతో ఆత్మహత్య తప్పించుకోడానికి తప్ప తాగేసాడు.

తాగి ఒంటిమీద తెలివి లేకపోయినా యీ మారు మూల వుచ్చ కంపునించి అమరగానం వుండి వుండి వినిపిస్తున్నాడు. నారాయణమ్మ చెవిలో ఆ కూనిరాగం పడి దగ్గిరగా వెళ్ళింది. వాడి చేతిలో రిష్టు వాచి వుంది. అదిమి పట్టి పైకి లేవనెత్తింది. లేచాడు గానీ జూగిపడిపోతున్నాడు. చెయ్యి పట్టుకుని మెల్లగా నడిపించి ఆ పక్కనే వున్న గుట్టమీద తాటాకుల కొంపలోనికి తీసుక వెళ్ళింది. ఇద్దరే తలదాచుకోడానికి సరిపడే కొంపది.

అర్ధ రాత్రి దాటిపోయింది. అప్పుడప్పుడు కదిలే లారీల శబ్దం. దక్షిణ దిశ నించి వుప్పుటేరు దుర్గంధం. పడమటనున్న శ్మశానంనించి కట్టెలు కాలి వదిలిన చమురు కంపు నలు దిశలా వ్యాపించిన మెర్క్యురి లైట్ల వెలుతురు విడి విడిగానున్న తాటాకుల కప్పులోనించి లోనకు పడుతోంది. గోపాలంకి తెలివి వచ్చేసరికి నేలమీద చింకి తాటాకుల చాపకు చెయ్యి తగిలింది గానీ పక్కనే తగిలి అదిమి పట్టి నారాయణమ్మ పడుకుంది.

యవ్వనం వచ్చాక యేది నిత్యం కోరుకున్నాడో, అదే యా వయసులో తొలిసారి ప్రాప్తించినట్లనిపించింది. మిడిసిపడుతూ మేలు కళ్లతో చూసి, మీదపడి మృదువైన శరీరాన్నంతా ఆమె వప్పచెప్పగానే గోపాలంలో తొలిసారి కామోద్రేకం అంటే చవి చూశాడు. ఆ క్షణంలో తన మగసిరిపై విశ్వాసం ఏర్పడింది. నారాయణమ్మను ఎవ్వరు నివ్వని అడగలేదు. ఎక్కడున్నావని అనుకోలేదు. ఆ రాత్రంతా నిద్రపోలేదు. మళ్లీ మళ్లీ యీ శుభ ఘడియలు యీ అవకాశం దొరకదేమోనన్న శంకతో నారాయణమ్మనలా నగ్న సుందరిగా వుంచేశాడు. కాలం యిలా తనకోసం ఆగిపోదన్నట్లు తూరుపున తెలతెలవారే చిహ్నాలు కనిపించాయి.

ఆవేశం తగ్గాక చేతిలో రిష్టువాచీ చూసి అడిగాడు అలా ఆమెను పట్టుకునే.

"నీ పేరు"

"నారాయణమ్మ"

"నేనిక్కడికెలా వచ్చాను?"

"ఆ వుచ్చుల దొడ్డిలో జారిపోయావు. తెచ్చి బాధలో వున్నావని పక్కనేసుకున్నాను."

ఇంకా అతనిలో మమకారం హెచ్చినట్లుంది. ఆమె గత చరిత్ర అంతా తెలిసి పోయినట్లుంది. అందుకే.

"నేనంటే యిష్టమేనా?" అన్నాడు.

"ఇష్టమే"

"ఎందుకు?"

"నీవుబాగా పాడతావు"

"పాటలంటే నీ కిష్టమా?"

"మా నాయన మా వూర్లో కీర్తనలు పాడేవాడు."

"నీవు నేర్చావా? ఏది మెల్లగా...."

"గరుడ గమన రారా– నను నీ కరుణ నేలుకోరా!" అంది చిన్న కూని రాగంతో.

"నిన్ను ఏలుకుంటాను" నీ కిష్టమేనా?"

"రెండింటికి ఒప్పుకుంటే"

"ఆ షరతులేమిటో చెప్పు"

"నా పాతబతుకు గురించి అడక్కు. నీ బతుకు గురించి నే నడగను."

"సరే ఒప్పుకున్నాను. ఇంకో షరతేమిటి?"

"నీవు తాగితే నాకిష్టం వుండదు"

"తప్పా?

"నీ కూడుతిని నీ కళ్లు కప్పను. తాగినోళ్లకి మాట విలకద వుండదు. తాగితే నీతి తప్పానని నిందలేస్తావు" "సరే. రెండు షరతులకూ ఒప్పుకున్నాను."

ఇంటికి పొద్దున్నే వెళ్లిపోయాడు. ఆ రాత్రి యేడు గంటలకే నారాయణమ్మ దగ్గరకు వచ్చేసాడు. సబ్బుతో ఒళ్లంతా రుద్దుకుని సన్నని చీర సర్దుకుని మరీ వేచివుంది. నలుపైనా నిగనిగ మెరుస్తోంది. ముఖాన యెర్రని కుంకుమబొట్టు దిద్ది మరీ పెట్టింది. గోపాలంని చూడగానే చంగునలేచి కులుకుతూ పొంగి వలపుబాటలో నడిచింది. మూడు రాత్రుళ్లు ఓవర్‌టైంమని అబద్ధాలాడి జీవితంలో తొలిసారి మూడు రాత్రులను గడిపిన మహదానందంతో ప్రోవిడెంట్‌ఫండ్‌లో మూడువేలు అప్పుపెట్టాడు. ఆ డబ్బు అందుకున్న వెంటనే యెలానూ యీ జాగా బాగులేదు. బటారు బయలుగా వుంది. ఏ క్షణాన మ్యునిషిపాల్టీ వాళ్లు పీకేస్తారో? అప్పుడే ఆ పాకల వాళ్లకి రెండుసార్లు బెదరించారని, నారాయణమ్మ వుండటానికి ఒక మంచి పాక వెయ్యాలని నిర్ణయించుకున్నాడు. ఒక బంజరులో జాగా ఆక్రమించి పాకవేశాడు. అందులో చిన్న మంచం, పరుపు ఆమె సొగసు చూసుకోడానికి ఒక సెకండ్‌హేండ్ నిలువుటద్దం, నాలుగు చీరలు యిలా ఆ డబ్బు ఖర్చు పెట్టగా మిగిలినది నారాయణమ్మచేత యిల్లు గడపటానికి పెట్టాడు. ఇవన్నీ జరిగిన మరునాడే యింట్లో మామగారు తగవుపెట్టడం గోపాలం మూడోసారి యిల్లు వదలటం జరిగింది.

* * * *

జీతాల రోజు. పావని ఫోనుచేసి మరీ వచ్చింది. అప్పటికే వూర్లో చుట్టాలలోనూ, ఆఫీసులో పనివాళ్లలోనూ యీ మొగుడూ పెళ్లాల తగవు చిలవయి పలవలు చేసుకుని ఒక నోటినించి యింకో నోటికీ మార్పులతోనూ చేర్పులతోనూ చక్కని కథలై నడుస్తున్నాయి.

అప్పటికే లోకం తెలుసుకున్నది. అనుకున్న దేమిటంటే...

"అంత బాగా పాడే గోపాలం గొంతులో అపస్వరంలా బజారుముండ యెవరో పలుకుతోందట! ఆట యేమిటి? దానితో సినిమాలకే తిరుగుతోంటే."

"గోపాలం యెప్పుడూ లిమ్కాయైనా తాగే వాడు కాదే. అలాంటిది కాక్‌టెయిల్లోనికి దిగాడంటే యేదో గొప్ప సెట్‌బేక్ వచ్చి వుంటుంది..."

"ఆ మధ్య వీర్యవృద్ధికి ఆయుర్వేద లేహ్యాలు తిన్నాడట. ఇంజక్షన్లేవో తీసుకున్నాడట. ఈ ముండ దగ్గరికి చేరడానికేనా?"

"పెళ్లయి యిద్దరి పిల్లల తండ్రయి అంత మంచివాడని పేరు సంపాదించుకున్నవాడికి నాలుగు పదులు దాటేక యీ వూబిలో యెందుకు కూరుకు పోయాడో?"



ఒకడు మెల్లగా అనేసాడు "పెళ్ళాన్నిగాని అనుమానించాడా?"

పెళ్ళాం అంటే గోపాలానికి హడలుకదా.. అనుమానించడం ఒకటా? వెర్రిగా వాగితే నాలిక కోసేస్తుంది. తను చెప్పినట్లు గానుగెద్దులా తిరగకపోతే కొరడాతో చెమ్డాలూడదీస్తుంది."

చుట్టూ వున్నవాళ్ళు యిలా చిత్రంగా చిత్రాలు రాసుకుంటుంటే, నీడల్లా యీ భార్యా భర్తలు జీవితాలనాడు ఆఫీసు యజమాని గదిలోనికి వచ్చారు. ఈ నీడలకు నోళ్ళున్నయి. గోతులైన మనసుల్లో మురికినీరు చేరేవుంది. ఒకరివేపు ఒకరు చూసుకోకండానే వాదనలు జరుగుతున్నాయి

"మిస్టర్ గోపాలం. నీ ప్రవర్తన యింతగా దిగజారిందే?"

జవాబుగా వచ్చిన గోపాలం చిన్న నవ్వును చూసి

"నేను చాలా ముఖ్య విషయం యెత్తితే అలా నవ్వుతా వెందుకు?"

"ఏడవమంటారా?"

"ఆ జవాబు బట్టే ఆలోచించండి" అంది పావని.

"ఎందుకిలా చేసావ్?"

"ఎలా?"

"తాగుతున్నావట. ఎవరితో బజారుముండతో తిరుగుతున్నావట?"

"ఎవరు చెప్పారు?"

"ఎవరు చెప్పారో నేను నీతో విన్నవించుకో అఖ్ఖర్లేదు. గానీ ఆఫీసు పెద్దగా యిదే నిజమైతే నిన్ను సరియైనదారిలో పెట్టకూడదా?

"అయితే వినండి మీరన్న అటలన్ని అబద్ధం ఇప్పుడు నేను నడుస్తున్న దారి సరైనదని నా విశ్వాసం."

"అయితే యింటికెందుకు వెళ్ళటంలేదు? జీతం యెందుకివ్వటంలేదు?"

"ఇప్పటి వరకూ నాకో యిల్లులేదు."

"ఇన్నాళ్ళూ ఎక్కడున్నావ్?"

"అది మా మామగారిల్లు"

"అక్కడ నీ కుటుంబం వుందికదా. వాళ్ళని పోషించే బాధ్యత నీకులేదా?"

"నా కుటుంబాన్ని పోషించే బాధ్యత నాకువుంది."

"అంచేత నీ జీతం తీసుకోడానికి నీ భార్య వచ్చింది"

"నా జీతం నేను ఆర్జించాను. మీరు దయచేసి యింకొకరికి దానం చెయకండి"

"దానం" యీసడించింది పావని.

"నా యిష్టం వచ్చినట్లు ఖర్చుపెట్టుకుంటాను"

"ఇష్టం... ఏమండి. మీ పుణ్యం వుంటుంది. ఇదేదో సెటల్ అయ్యేవరకు... అతని చేతికి డబ్బురాకుండా చూడండి. ఆటకట్టేస్తుంది." అని పావని యజమానికి బ్రతిమాలె ధోరణిలో అంటే

"నా జీతం ముట్టుకోడానికి యెవరికి అధికారంలేదు. ఈ వేళ నేను డ్యూటీకి వచ్చాను. నేను సంతకంపెట్టి నా జీతం తీసుకుంటాను."

"ఎవరెలా యిస్తారో నే చూస్తానని" పావని సవాలు చెయ్యగానే "ఇవ్వనని అనమను"

## బానిస బ్రతుకులు

"అనండి" అని యజమానివేపు తిరిగితే అతను మాటాడకండా యిరువురివేపు అలా చూస్తున్నాడు.

"మాటాడరేం?" అని రెట్టించింది పావని

"ఏం మాటాడతాను? జీతం అతనికివ్వననడానికి నాకు అధికారంలేదు. ఏమయ్యా? గోపాలం. ఏ కుటుంబంలోనైనా యేవో చిన్న తగవు లొస్తుంటాయి. సర్దుక పోకపోతే కటుంబ గౌరవం మంట గలపదా? ఆవిడ బయటకు అలా ధైర్యంగా మాటాడుతున్నా లోపల యెంతగా కుమిలి పోతోందో? రేప్రొద్దు ఫలానావాడి బిడ్డ అని చెప్పుకుంటేగానీ పెళ్ళిళ్ళు పేరంటాలు అన్నీ జరగాలి కదా! ఇప్పటికే ఒక గౌరవమైన కటుంబం మర్యాద వీధిలో పడింది. నేను బయటకు వెళ్తాను ఇద్దరూ కాస్సేపు మాటాడుకుని ఒక నిర్ణయానికి రండి" అంటూ లేచిపోతుంటే గోపాలం కూడా లేచిపోతూ.

"వద్దు మీరు లేవకండి. ఇందులో నిర్ణయానికి యిదేం పెద్ద సమస్య కాదు ఇన్నాళ్ళకి నాకా యిల్లు నా యిల్లు కాదు, అది నా అత్తవారిల్లు అనిపించింది. అత్తవారింట్లో అల్లుడు వుండటం అనర్థమని బయలుకొచ్చేసాను. పరిస్థితు లలా వచ్చాయి నా భార్యా బిడ్డలను ఆదుకోనని నేనెప్పుడూ అనలేదు. వాళ్ళు నేను తీసుకునే అద్దె యింట్లోక వచ్చి వుంటానంటే నాకేం అభ్యంతరం లేదు. నా తాహతుకు తగ్గట్లు వాళ్ళను సుఖంగా వుంచడానికి ప్రయత్నిస్తాను."

"మా నాన్న రెండంతస్థుల మేడలో చిన్నప్పటి నించి పెరిగాను. నా తమ్ముడు పైదేశం నించి నెలకు పదిహేను వేలు పంపిస్తున్నాడు నా పిల్లల చదువులు కాన్వెంటులో చదువు తున్నారు. అవన్నీ వదులుకుని యితగాడి పాకలో వుండే ఖర్మ నాకేం వచ్చింది?"

"అయితే నెల కంత కుటుంబానికని" యజమాని అంటుంటే;

"నాకి బిక్ష అఖ్ఖర్లేదు. ఇలాంటి వాళ్ళని నలుగుర్ని పోషించ గలం!"

"మరి జీతం ఆపడం దేనికి?" అన్నాడు యజమాని.

"ఈ జీతం యెలా ఖర్చు పెడుతున్నాడో ఆలోచించండి!"

"గోపాలం కుటుంబాన్ని పోషించనని అనలేదు కదా! మీ యిద్దరూ యేదో పంతంలో చిక్కుకున్నట్లుంది. మాది న్యాయస్థానం కాదు. మాకు దండనాధికారాలు లేవు. ఇది సివిల్ కేసులా వుంది. నేనేం చెయ్యలేను." అనేసాడు యజమాని.

గోపాలం ముందు కదలి పోయాడు. తరువాత పావని చర్రున లేచి వెళ్ళిపోయింది.

* * * *

పెంపుడు కుక్క యింట్లో నించి పారిపోయి యింకో యజమానిపై విశ్వాసం పెంచుకున్నట్లు అనిపించింది పావనికి. కరువుగా మాటాడే మొగుడు యిప్పుడు మాటలతో రంపంకోత నేర్చుకున్నా డెలా? సహవాస దోషంతో చెప్పులూ రాళ్ళూ విసిరే కొంటి కుర్రానిలా మొగుడు యజమాని యెదరగా కనిపించాడు ఈ బొంకు రంకు వ్యాపారం యెన్నాళ్ళు సాగుతుందో నేనూ చూస్తానని భీష్మించు కుంది. మేక ప్రసంగం చేస్తున్నాడు గుడిసెను మేడ చేద్దామని తాపత్రయ పడుతున్నాడు. గుడ్డిగా ఒక పులి బోనులో దూరిన యీ మేకపోతు గాంభీర్యంతో యేం సాధిస్తాడో నేనూ చూస్తానని పంతం పట్టింది.

ఇలా రోజుకి రోజూ హెచ్చుతున్న పంతం పచ్చిగోడై తనమీదే పడినట్లుంది. తన వాగుడు తన పనికి, తన నిద్రకే చేటు చేస్తున్నాయ్. ఈ ధీరురాలు మగని దండించడానికి యే దండం దొరక్క దీనురాలై పోయి, యేం చెయ్యడానికి పాలుపోని సమయంలో తన తమ్ముడు వాసు చెప్పకా చెయ్యకా వచ్చేడు.

"ఏంరా ఉత్తరమైనా రాయకుండా వచ్చేసావ్?" అని తండ్రి అంటే, "మీ అందరికి సర్‌ప్రైజ్ యిద్దామని!"

"నేను రాసిన ఉత్తరాలన్ని చేరాయను కుంటాను."

'ఫోటోలతో సహా చేరాయి!"

"ఏ అమ్మాయైనా నచ్చిందా?"

"తరువాత అవన్ని మాటాడుకుందాం! మేష్టారు బాగున్నారా?"

"మేష్టారు మాటకేం గానీ... ముందు స్నానం చెయ్యి. ఎప్పుడు తిన్నావో యేమిటో?" అంది పావని.

స్నానం అయ్యాక బట్టలు మార్చుకుని,

"ఈ రెండు చీరలు నీకు. ఈ డ్రెస్ బాబిగాడికి. ఈ మిడ్డి బేబికి. . మరి యీ డ్రెస్ మేష్టారికి!"

అన్ని పుచ్చుకున్న పావని మేష్టారి డ్రెస్ పుచ్చుకో లేదు.

'ఏం?'

'ఎక్కడున్నాడో వెతికి నివ్వే వెళ్ళి యియ్యి." అంది, పావని.

"ఏమైంది?"

"ఏం చెప్తానురా... సిగ్గుతో వీధిలోనికి వెళ్ళటం మానేసాను' అన్నాడు తండ్రి సదాశివరావు

"మళ్ళీ అలక సాగించారా?"

"అలక! ఈ సారి అలక కాదు బంధాలన్నీ తెంపేసుకుని ఒక బజారు ముండతో యెక్కడో వున్నాడు."

"ఈ వూర్లోనేనా?"

"హాఁ! ఆఫీసు కెల్తున్నాడు. జీతం దాని ఒడిలో పోస్తున్నాడు."

"మేష్టారు ఎందుకు యిలా చేసారో కారణం తెలుసుకున్నారా?"

"పోయేకాలం!" అని తండ్రి తేల్చేగానే,

"ఎన్నాళ్ళైంది వెళ్ళిపోయి?"

"రెండు నెలలు దాటి పోయింది!"

"ఇంత జరిగినా నా కెందుకు రాయలేదూ?"

"నేను రాస్తానంటే, నాన్నే వద్దన్నారు!" అంది

పావని

"ఎందుకు రాయలేదండి?"

"అక్కడ ఒక్కడివి వున్నావు నివ్వు బాధపడటం దేనికని?"

"అసలు కారణం యేమిటో తెలుసుకోడానికి ప్రయత్నించారా?"

"అప్పుడప్పుడు తాగుతున్నాడని తెలిసి డబ్బుంటే పాడు చేస్తాడని మూడు వేలు ప్రావిడెంట్ ఫండ్‌లోను గురించి అడిగాను ఆ మరుచటి రోజే వెళ్లిపోయాడు "

"డబ్బు గురించే యిలా చేసాడంటే నమ్మలేను!"

"ఆ డబ్బు చూసుకునే యింతపనీ చేసాడు కదా మీ మేష్టారు" అంది పావని.

"డబ్బు వాడికి చేరకుండా చేద్దామని పావని వాడి ఆఫీసుకు వెళ్లి ప్రయత్నించింది. లాభం లేకపోయింది "

"డబ్బు కారణం అయ్యి వుండదు మనం లక్ష్మి అని కొలుస్తాం గానీ.... పెట్రోలులా నిముషంలో డబ్బు అంటుకపోతుంది ఇంత సాహసం చేసారంటే చాలా బలమైన కారణం వుండాలి."

"ఇంత చెడ్డ రోజులు నా జీవితంలో కలలో నైనా చూడలేదురా! బయటకు వెళ్లలేను. వచ్చావు కదా! కొనాళ్ళుంటావు కదా.. ప్రయత్నించు" అన్నాడు తండ్రి.

మరుచటి రోజు వుదయమే ఆఫీసు గేటు దగ్గర కాసాడు వాసు గోపాలం "మేష్టారూ!" అన్న కేక వినగానే ఒక్కసారి అదిరిపడి చూసాడు.

"ఏమిటయ్యా ఎప్పుడొచ్చావు?"

"నిన్న .."

"ఎన్నాళ్ళు శెలవు?"

" నా శలవు మాటకేం గాని ... ఈ వేళకి మీరు శలవు పెట్టకూడదూ! ఇద్దరం అలా సరదాగా తిరుగుదాం. మీ పాటలు విని యెన్నాళ్లయి పోయిందో అనిపిస్తోంది వాచిపోయా ననుకోండి!"

"తప్పదా?"

"కొత్తగా అడుగు తున్నారు. ఇదివర కెప్పుడూ నా విషయంలో మీరు సంశయించలేదే?"

"అయితే యిక్కడే వుండు లోపలకు వెళ్లి శలవు చీటి పెట్టి వస్తాను" అని లోపలికి వెళ్లాడు. ఒక అరగంట తరవాత బయటకు వచ్చి,

"ఈ వేళ చెయ్యవలసిన పని యింకొకరికి అప్పజెప్పడంలో ఆలస్య మైంది చెప్పు యెక్కడికి వెళ్దాం?"

'ఎక్కడికి వెళ్దాం? ఎక్కడికి వెళ్తే మనం హాయిగా మాటాడుకోగలం? మీ పాట వినగలను? మీ యింటికే...."

"నా యిల్లా?"

'మీ రెక్కడుంటే అక్కడకు. నాకు యెట్టి అభ్యంతరం లేదు."

"అభ్యంతరం అని కాదు ఒక పాకు నించి బయటపడి సుఖంగా వున్నాను. నివ్వు యింకో పాకు యివ్వనంటే నాకేం అభ్యంతరం లేదు"

# ఇడ్లీ = ఇడ్లెన అంటే?

మోనియర్ విలియమ్స్ సంస్కృతం ఇంగ్లీషు నిఘంటువు (1899) లో "ఇణ్డరి" లేదా "ఇణ్డరీ" అంటే "ఎ కయిండ్ ఆఫ్ కేక్" అని ఉంది. ఈ మాట నిఘంటువులలో కనపడేదే కాని వాడకంలో లేదని నిఘంటువుని తయారు చేసిన వారు సూచించారు కాని "మాష- ఇణ్డరి" వైద్యగ్రంధాలలో ఉన్నదని ఆయుర్వేద శిరోమణి చెదలువాడ రాజరాజేశ్వరశర్మగారు ఈ విలేఖరికి చెప్పారు

అన్నద్రవ శూలం

భోంచేసిన అన్నం జీర్ణం అయ్యేటప్పుడు, జీర్ణమైన సిగప వచ్చే కడుపు నొప్పికి

మాషెండరిం సలవణాం
సుస్విన్నాం తైలపాచితాం!
తాదృశీం సర్పిషా ఖాదేదన్న
ద్రవ నిపీడితః –

సైంధవ లవణం కలిసిన మాషెండరీని (మినపప్పు వంటకం) ఆవిరిలో పెట్టి, నెయ్యితో గానీ, నూనెతో కాల్చి ఎత్తిగానీ అన్నద్రవములో తినాలి

(భావమిశ్రుడి భావప్రకాశం)

మదరాసు యూనివర్సిటీ ప్రచురణ తమిళ్ లెక్సికాన్ మొదటి సంపుటంలో –

"ఇట్టలి" అంటే "ఎ కయిండ్ ఆఫ్ కేక్ ప్రిపేర్డ్ బయి స్టీమింగ్ సెమిసాలిడ్ డో మేడ్ ఆఫ్ రయిస్ మిక్సడ్ విత్ బ్లాక్‌గ్రామ్" అని ఉంది.

'ఇటి' అంటే "పౌడర్, డస్ట్, ఎనీతింగ్ సల్వరయిస్‌డ్" అని కూడా ఉంది.

"ఇటియల్"కి "ఎ లూస్ కన్‌ఫెక్షనరీ మేడ్ ఆఫ్ ఫ్లోర్" అని రాసి ఉంది

బర్రో, ఎమెనోల "ఎ ద్రవిడియన్ ఎటిమలాజికల్ డిక్షనరీ లో తమిళ్ లెక్సికాన్‌లోని మాటలనే వేశారు "ఇట్టలి"కి

ఇడ్లీ, ఇడ్డెన అనే మాటలలో ఆవిరి లేదా వేడితో తయారయిన భక్ష్యం అన్న అర్థం ఇమిడి ఉన్నదని కొందరు అనగా ఈ విలేఖరి విన్నాడు కాని నిఘంటువులు చూస్తే ఈ అర్థమే స్ఫురించటం లేదు!




తమిళంలో "ఇత్తి" అంటే "వయిట్ ఫిగ్" అని అర్థం అని బర్రో, ఎమెనోల నిఘంటువే తెలుపుతోంది

కన్నడంలో బొగ్గుకి "ఇద్దిల్" అంటారని తెలుస్తోంది! మలయాళంలో "ఇడ్లి" అంటే "మంచి అర్థం" లేదని ఈ విలేఖరికి ఒక అరవ స్నేహితుడు చెప్పాడు

సి. కె. గోడె, తంకప్పన్‌నాయర్ మొదలయిన వారు ఇడ్లీ, దోసె వగయిరాలని గురించి పెద్ద వ్యాసాలు రాశారు ఇది ఒక ప్రాచీనమయిన భక్ష్య విశేషం అన్న మాట వినపడుతూ ఉంటుంది కాని దానికి గట్టి ఆధారం ఉన్నట్లు తోచదు!

ఇడ్లీ, వడ, దోసె, ఉప్మా. లాంటివి ప్రపంచంలో ఎన్నో చోట్ల వండుతూనే వచ్చారు జనం అనుకోవాలి

ఇటీవలే ప్రొఫెసర్ చల్లా రాధాకృష్ణశర్మగారు (ఆంధ్రపత్రికలో) ఒక చిన్న వ్యాసం రాశారు కాని ఇడ్డెన = ఇడ్లీ యొక్క ధాతువు' (?) జోలికి వెళ్లలేదనే అనాలి!

దోసె సంగతి ఏమిటి? — రా. గం.

"మీ మీద వున్న గౌరవంతో నేనంత పని చేస్తానా?"

'నిజమే' చిన్నప్పటి నించి నీ ప్రవర్తనే వేరు. ఎదుటి వాళ్ల గురించి ఆలోచిస్తావు. నివ్వు వెళ్లిపోయాక నన్ను మర్యాద యిచ్చిన వాళ్లే లేకపోయారు నేను పిచ్చి రాగాలు తీసే పిచ్చి వెధవనై పోయాను.'

"ఏమిటలా అయిపోతున్నారు? మీ చల్లని నవ్వును దాచేస్తున్నారేం?"

అనగానే నడుస్తూనే గోపాలం సహజమైన చిరునవ్వుతో ముఖం వెలిగించాడు కొంత దూరం వెళ్లాక ఆటో దొరికింది ఇద్దరూ యెక్కారు.

(ఇంకావుంది)

పెద్ద కథ

# బానిస బ్రతుకులు

బలివాడ కాంతారావు

(గత సంచిక తరువాయి),

నేషనల్ హైవే మీదుగా ఆటో పోతోంది. ఒకరి ముఖాలొకరు తొలిసారి స్పష్టంగా చూసుకున్నారు. ఎప్పుడూలేని వెలుగును గోపాలం ముఖంలో చూసాడు వాసు. మనసును మండించుకున్నాడు అని అంతా అన్న ఆ మనసును మెరుగు పెట్టుకున్నట్లునిపించింది. ఈ మెరుగు మనిషికి యింకో మనిషితో సంబంధం వలన వస్తుంది. ఆ వెలుగు యెవరో యింకో ధగధగ మెరిసే మనిషి ప్రకాశం పడగా వస్తుంది. ఇతనిలో యీ మార్పు తెచ్చిన ఆమెను చూడాలని వాసు ఆతృత పడుతున్నాడు.

ఆటో ఆగింది. ఇద్దరూ దిగారు.

"ప్రస్తుతానికి నేనున్న యిల్లు చూపిస్తాను. నివ్వు యీ ఇల్లు నీ ఇంట్లో వాళ్ల కెవ్వరికి చూపించవనే నమ్మకంతోనే నిన్ను తీసుక వెళ్తున్నాను. ఇంకో విషయం. నడు చెప్తాను. అని నేషనల్ హైవే మీదనుంచి వుత్తరవేపు వుండే కొండ మీదకు పోయేరోడ్డు మీద పడ్డారు. 'ఈ రోడ్డుకు యిరువేపులా పాకలే. ఇంచుమించు కొండదిగవ చెరియలు పాకలతో నిండిపోయి వున్నాయి. గోపాలం తీసుక వెళ్లినది అన్నిటికన్నా యెత్తున. వున్నది. ఆ వెనుక ప్రక్కన యెక్కడా యిల్లులేవు. ఆ పాక వెనుకనే పెద్ద తంగేడు చెట్టు వుంది. పావు గంటపైగా అక్కడికి చేరడానికి పట్టింది. అక్కడ నిల్చొని చూస్తే పట్టణం అంతా కళ్ల యెదుట వుంది. హాయిగా మంచిగాలి వీస్తోంది. చుట్టుపట్ల తుప్పలపైన పూలతీవలు, రంగు రంగుల పూలమధ్య కుటీరంలా వుంది పాక. పాకలోనికి వెళ్లే ముందు గోపాలం అన్నాడు.

"నీకు అంతా యీ సరికి తెలిసే వుంటుంది. నీకేమైనా అనాలనుంటే అడగాలని వుంటే లేక తెలుసుకోవాలని వుంటే నన్ను అడుగు. నారాయణమ్మని యేమీ అడగొద్దు."

"అలాగే. పదండి" అన్నాడు.

పాకలో ముందు గోపాలం దూరేడు. వెనుకనే వాసు వెళ్లాడు.

"వీడు మా బావ వాసు.." అంటూ నారాయణమ్మతో చెప్పాడు. చాపపరిచి కూర్చోబెట్టింది. టీ చేసి యిచ్చింది.

ముగ్గురూ టీ తాగేక.

"చెట్టు కిందకుపోయి పాడుకుందామా?" అన్నాడు వాసు.

"నా పాటేమిటి వింటావోయ్?"

"ఇంకెవరిది వినమంటారు?"

"నారాయణమ్మ... పల్లెపదాలు అమోఘంగా పాడుతుంది"

నారాయణమ్మ కాటుక కళ్లు ఒక్కసారి సిగ్గుతో మెరిసాయి.

"వీళ్లయ్యకి తప్పెడిగుళ్ళ ఆటవచ్చు. చిన్నప్పటినించి వినేదికదా... ఆలయ, దరువు పట్టేసింది. కోతలపాట నించి కోయ్యోడ పాటవరకు... యెంతవిన్నా విసుగుపుట్టదు."

ముగ్గురూ చెట్టు కిందకు వచ్చారు. ఆ క్రింద కూర్చుంటే పట్నం పట్నం అంతా థియేటరయి పోయినట్లుంది. ముందుగా గోపాలం యెత్తుతే నారాయణమ్మ అందుకుంది.

"పన్నెండు పరగణాలు వానదేవుడా
పంటలు పండాలి "
పేద సాద బతకాలి "
కూలినాలి దొరకాలి "
ఊరికెళ్లిన బావ "
ఉరికురికి రావాలి "
చేటంత మబ్బుపట్టి "
చెరువంతా నిండాలి "
డబ్బుకు తవ్వెడు బియ్యం "
మనిషికిద్దరు పెళ్లాలు "
మూడు రోజుల యెండ "
ముప్పయి రోజుల ముసురు "

ఇలాగానా బజానా కొంతసేపు సాగింది.

"మన చుట్టం వచ్చాడు. వంట చెయ్యవా?" అడిగాడు గోపాలం.

"ఇంటికి వెళ్లిపోతాను."

"నా చాతనైన వంట. కాదనకు బాబూ?"

"ఇవ్వుడు వద్దు. రేపు రాత్రి భోజనానికి వస్తాను"

"అలాగే..." అంటూ ఆమె పాకలోనికి వెళ్లిపోయింది. ఇంత యెత్తులో నీరులేకపోయినా గాలిబాగుంది. వెనుకనున్న డొంకలలో మేకలు తిరుగుతున్నాయి. డొంకల మీద తివ్వలపై పిట్టలరుస్తున్నాయి. చెట్టుకింద యిద్దరూ కోపాలు, తాపాలు లేని వాళ్లలా కాస్సేపు మౌనంగా కూర్చున్నారు. గారడ వాడి దగ్గర గారడీ చేస్తే లాభంలేదని తెలుసుకున్నవారు వాసు. అందుకే "మేష్టారూ మీ మీదనున్న మూడుప్రాణాల భారం యెత్తేసి యిలా యేం వచ్చేసారు?" అన్నాడు స్పష్టంగా చప్పున.

వాసు కారణం అడుగుతాడనుకున్నాడు గాని యిప్పుడే అడుగుతాడని అనుకోని గోపాలం కాస్సేపయ్యాక సమాధానం చెప్పాడు.

"దెబ్బలు తినే బలంలేక..."

"నేను వెళ్లాక దెబ్బలుతిన్నారా?"

గోపాలం నిట్టూర్చి

"ఒకరు చేతో కొట్తారు. కొందరు మాటలతో కొట్తారు. మరికొందరు చేష్టలతో కొట్తారు."

బాధ్యత అన్ని అవమానాలనీ భరింప జేస్తుందనుకున్నాను."

"నన్నేం చెయ్యమంటావ్? నేను చచ్చిపోతున్నానని కలలుగన్న రోజులున్నప్పుడు నేను యెవర్నికాను. దేనికి పనికిరాను. అన్నభావం వచ్చేసింది. సరే! లేద్దాం! ఇంకా తవ్వితే పాతిపెట్టిన శవం బయటపడుతుంది. దాన్ని చూసి మళ్లీ నాలో పోయిన భయం రాగలదు."

అంటూ గోపాలం లేచిపోయాడు.

ఇంటికి వెళ్లేసరికి తండ్రి ఆతృతగా అడిగాడు.

"కలిసావా?"

"కలిసాను?"

"ఎక్కడ?"

"మేష్టారింట్లో"

"వాడికొక యిల్లా?"

"అతని డబ్బుతో లేపుకున్న పాక"

"ఎక్కడుంది?"

"చెప్పకూడదు"

"ఏం?"

"చెప్తే – మీ రెవరైనా వెళ్తారు. వెళ్తే ఆ పాక పీకేసి యింకో చోటికి పోతాడు"

"గతిలేక గంజితాగినోడికి అన్నంపెట్టి చదివించి, వాడికో అంతస్థు యిచ్చానురా."

"ఏనాడూ అతను కాదనలేదు"

"మరి యిదేంపని?"

"సుఖం, శోకంతో జీవితాన్ని కొలుస్తాంగానీ, అంతస్థులతో కొలుస్తామా?"

"ఇప్పుడూ అతని దగ్గగ పాఠాలు నేర్చుకుని వచ్చాడు వాసు. ఊరుకోండి నాన్నా?" అంది పావని చిరాగ్గా.

"నీ దగ్గరా మేష్టారు పాఠాలు నేర్చుకున్నట్లున్నారు." అనేసి అక్కడనించి వెళ్లిపోయాడు ప్రక్క గదిలోనికి.

★ ★ ★ ★

మరుచటి రోజు చీకటి పడక ముందే వాసు గోపాలం గుడిసె దగ్గరకు వెళ్లాడు. గోపాలం యింకా రాలేదు. నారాయణమ్మ వాసును లోపలకువచ్చి చాపమీద కూర్చోమంది కూర్చున్నాడు. తెచ్చిన పేకెట్ పక్కనే

పెట్టుకున్నాడు. పాక పెరటకు చిన్న వంటకొట్టులా వుంది అక్కడ కూరగాయలు తరుక్కుంటుంటే వాసు మాటలు కలిపాడు

"ఏం కూర?"

"వంకాయ ముద్దకూర"

"ఏకూరైనా వండివచ్చుగానీ వంకాయ ముద్దకూర రుచిగా వండటం చాలా కష్టం"

'గోపాలంగారే నేర్పించారు"

"బాగా వండుతారాయన మీ వూర్లొ యేంవండేదానవు?'

"ఏం వంట? పల్లెటూరివంట ఇంత వుప్పు ఇంత కారం యేసి వుడకేసేవాళ్లం ఇన్ని రుచులుంటాయని యెన్నడూ అనుకోలేదు "

"తెలియక అడుగుతాను పట్నం యెందుకొచ్చేసావ్?

అదంతా పెద్ద కత మీతో చెప్పి మీ మనసేల పాడుసెయ్యాల "

"ఫరవాలేదు వింటాను చెప్పు"

"మొగోడెలాగేనా బతికేస్తాడు గానండీ, ఆడదానికి నానా పత్రాకులు'

'ఏం?"

'ఆడదానికి గులాబి పువ్వు అంటూనే తెంపేస్తారండీ ఆడదాన్ని సూస్తే అవతారం యెత్తినోలే ఎక్కువ ఆంబోతుల్లా పరుగెత్తుత్తారు పందుల్లా దొర్లుతారు నిలబడితే గుండేసి కొట్టారు అద్దడు మినుములు తిని రెండ్డడ్ల పాలు తాగి కొవ్వినాడిలో అదే రకతం, పస్తులు చేసిన ఆడదానిది అదే రకతం కదా - ఆంబపైత్యాలు పెంచుకొని ఆడదాన్ని, చెట్టును నరికి చిరేసి వంట చెరుకుగా అమ్మేసినట్లు చేస్తే

"నిన్ను అలా చేసారా?'

"మరి అడక్కండి ఆ సంగతులు గుండె బెదరుతున్నాది నివ్వేం పాపం ఎరుగనిదానివి కదా!

'తెలిసి పాపాలు ఎవరూ సెయ్యరండి పాపాలు చెయ్యిస్తారండి చెయ్యించినోలు తప్పుకపోతారు చేసినోలు దొరికిపోతారు "

అలా దొరికిపోయావా?'

నారాయణమ్మ మౌనం దాల్చింది

ఏం వూరుకున్నావ్?"

'సుఖంకి పోతే శోకం కుక్కాదు! ఒకరు కాదు కట్టుకున్నోడి దగ్గర్నుంచి కలిసినోడి వరకు

అంటూ వెక్కి వెక్కి యేడుస్తూ తమరూ మరసిపోయిన ఫైనాన్ని కెలికి

'నారాయణమ్మా! గోపాలంకు పెళ్లం, ఎదిగిన కూతురు ఒక కొడుకు వున్నారని తెలుసా?"

"తెలుసండి' అంది కళ్ళు తుడుచుకుంటూ

"తెలిసి యీయన్ని యిక్కడ ఎందుకు యిలా కట్టిపెట్టేసావో?"

"నేనేం కట్టేలేదండి. ఉచ్చుల దొడ్లో దొర్లుతున్నవోడ్ని తీసి పక్కనేసుకున్నాను. నన్ను కలుసుకున్నాక మనిషయ్యానన్నారు. ఆ మాటలెంత నిజమోగానీ నన్ను మాత్రం మనిషి గారంగా సూసుకుంటున్నారు అలాంటి బాబుని నరకంలో తొయ్యమంటారా? అలాంటి పాపిష్టిది అలాటిదేముడులాంటి బాబుకి యేటివ్వగలను? నన్ను నాను మరిసిపోనాను. అంతా ఆ బాబే ఆ బాబే నిజం నాను అబద్ధం నాను మిగల్ను. ఆ బాబే మిగల్నాడు .. మీరెలిపోండి బాబూ . యెలిపోండి

వాసు లేవకపోటంతో ఆమె లేచి పెరటికి వెళ్లిపోయింది కొన్సేపు చూసి వాసు బయటకు వచ్చాడు పొద్దు సగం క్రుంగింది ఆ యెర్రని వెలుగులో తంగేడు చెట్టు క్రింద నారాయణమ్మ కూర్చొని వుంది మెల్లగా అక్కడికెళ్లాడు

నారాయణమ్మా! ఇంకెప్పుడూ యే విషయం అడగను వెళ్ళు వంకాయ ముద్దకూర వండు' అన్నాడు

కళ్ళు తుడుచుకొని నారాయణమ్మ పాక వేపు వెళ్లిపోయింది వాసు చెట్టు కింద కూర్చున్నాడు పొద్దును కప్పడానికి కదిలిన తెల్ల మేఘాలు యెర్రగా మండి కదలుతున్నాయి అర్ధచంద్రుడు ఆకాశం నోటిలో నవ్వుతూ, అప్పుడే కనిపిస్తున్నాడు కొన్సేపయ్యాక యీ నవ్వు చుట్టూ మిణుగురులా చుక్కలు కదులుతున్నాయి

గోపాలం యింకా రాలేదు పాక నించి హరికెన్ లాంతరు వెలుగు కనిపిస్తోంది గోపాలం గుర్తుకొచ్చి అనుకున్నాడు "ఓ బాటసారికి యిల్లూ పెళ్లాం పిల్లలూ సమకూరాయి అయినా బతకలేక మళ్లీ బాటసారి అయిపోయాడు త్రోవలో తారసిల్లిన యీ తంగేడు పువ్వును చూసి ఆగిపోయాడు మన్మధుడు పంపిన మోహిని అనుకుని మనసు కట్టుకోలేకపోయాడు "

ఇలా ఆలోచనలు పొంగించే ఆహ్లాదకరమైన



**తెల్ల వెంట్రుకలు నల్లపర్చును**

మేము యెక్కువగా ప్రశంశించదలచలేదు. మా ఆయుర్వేదక తైలము తెల్లవెంట్రుకలను కుదుళ్లనుంచి నల్లబర్చి, తెల్లవెంట్రుకలు రాకుండా అరికట్టును. మెదడుకు, కళ్లకు పుష్టిని కలిగించును. మందు గుణం ముందు ధర ఆలోచించదగినది కాదు. పూర్తికోర్సుకు, పోస్టేజి, ప్యాకింగ్ ఖర్చులు లేకుండా రు. 41/– మీ అడ్రసు ఇంగ్లీషులోనే వ్రాయండి.

**SUNITA AYURVED BHAVEN,**
P.O.–LALBIGHA (GAYA) [A.D.]

**హెచ్. ఎం. టి.**
**ఆటోమాటిక్ రిస్ట్‌వాచ్**

వెల : 25 రూపాయలు మాత్రమే.
21 జ్యూయల్స్, హెచ్.ఎం.టి. ఆటోమాటిక్ రిస్ట్‌వాచి చెయిన్ సిస్టమ్ కలిగినది. ఏడేళ్ళ గ్యారంటీ. కేవలం 25 రూపాయలు మాత్రమే. పోస్టేజీ ప్యాకింగ్ ఛార్జీలు అదనంగా పది రూపాయలు.

**ANITA TRADING Co.-(B)**
**P.O. Sheikhpura (MONGHYR)**

Photography for PLEASURE or PROFIT

ఫొటోగ్రఫీ, కలర్ ఫొటోగ్రఫీ, స్క్రీన్ ప్రింటింగ్

లను మీ విరామ సమయంలో నేర్చుకోండి. కోర్సులు ఇంగ్లీషు, హిందీ, తమిళంలో పోస్టుద్వారా నేర్పబడును.
ప్రాస్పెక్టసుకోసం 50 పైసల స్టాంపు పంపండి.

KALAIMATHI NILAYAM (P)
NANJAI THALAIYUR-639204.
Periyar (Dt), Tamilnadu.

**మీరు నిరుద్యోగులా ? ఐతే....**



నూతనముగా దర్జీపని నేర్చి, మీ సొమ్ము ఆదా చేయండి. నా పుస్తకాలద్వారా అనేకులు నేర్చిరి. నూతనముగా దర్జీ పని నేర్చువారూ, నేర్చుకున్న టైలర్లు ఈనాటి ఫ్యాషన్లతో చిత్రవిచిత్రమైన గొప్ప కటింగ్ ప్లాన్లు నేర్చువారు.

పూర్తి వివరాలకు వ్రాయండి :

**జి. పున్నారావు చౌదరి** (రచయిత)
మోపర్రు–522312, తెనాలి తాలూకా.

# బానిస బ్రతుకులు

వాతావరణం. ఊరంతా వెలిగిపోతూ తన కౌగిలిలోనికి కోరి వచ్చిన అతివలా వుంది. తన చిన్ననాడు చీకటిలో చిక్కుకున్న యీ పట్నం తన తల్లిలా ఆప్యాయంగా తాకి జోకొట్టినట్లుండేది. ఏవేవో జ్ఞాపకాల పరిధిలో పడి బయటకు రాలేకపోయాడు.

అంతలో గోపాలం వచ్చాడు. "అర్జంటు పని తగలటం వలన ఆలస్యమైందని "సంజాయిషీ యిస్తూ "ఇంకా వంట కాలేదు. ఇక్కడే కబుర్లు చెప్పుక కూర్చుందాం అన్నాడు. ఆకాశం నించి ప్రసరిస్తున్న ప్రకృతి వెలుగు -పట్నంనించి ప్రసరిస్తున్న కృత్రిమ వెలుగులో యిద్దరూ ఒకరినొకరు చూడగలుగుతున్నారు. సహజం, కృత్రిమం రెండూ బతకడానికి అవసరమన్నట్లు వాళ్ల ముఖాల్లో మారే భంగిమలు చెప్తున్నాయి. సహజమైన చిరునగవుతోపాటు కోరి తెచ్చుకున్న మందహాసం కూడా ముఖాన వెలిగించుకుంటున్నారు.

"ఏమిటి? వచ్చిన దగ్గరనించీ నా మీద చాలా రిసెర్చి చేస్తున్నావని విన్నాను" అన్నాడు గోపాలం నవ్వుతూనే.

"అలా అని ఎవరు చెప్పారు?"

"నేనేం మందులు తినేవాడినో కూడ తెలుసుకున్నావట"

"ఏ జబ్బో తెలుసుకోడానికి! అంతే. నారాయణమ్మతో కూడా మీరు రాక ముందు మాటాడాను."

"నిన్నెవరు మాటాడమన్నారు?"

"నిజం తెలుసుకోడానికి."

"కళ్లెదరగా వున్న నిజం చూడకపోతే నా తప్పా?"

"ఏమిటండీ ఆ నిజం? ఇంట్లో పెట్టుకుని పిల్లనివ్వటం తప్పా? ఇంటి బాధ్యతలను అప్పజెప్పటం తప్పా? అనవసరమైన ఖర్చుల గురించి అడగటం తప్పా?"

"అందుకు నేను యింటి నించి నేను బయటికి రాలేదు."

"మరి దేనికి?"

"నివ్వు వెళ్లాక ఆ యింట్లో వుండలేకపోయాను"

"ఏం?"

"అంతవరకూ ఆ యింట్లో కనీసం నీ ఒక్కడి గౌరవం నన్ను ఆ యిల్లు వదలకుండా చేసింది. నివ్వు వెళ్లిపోయాక నేను పుత్తి బానిసనయిపోయాను. నేను బాండెడ్ లేబర్‌గా బతికాను. మీ అక్కకు ముట్టుకోడానికి కూడా నాకు స్వతంత్రం లేదు. ఏదో భయం - ఆ భయంతో ముట్టుకుంటే ఒళ్లు వణికిపోయేది. ఇదేదో జబ్బనుకొని నానా మందులు, ఇంజక్షనులు వాడాను. నాకే జబ్బూ లేదని నారాయణమ్మ నిరూపించింది. ఎలా? మీ అక్క యివ్వలేని స్వతంత్ర భావం యీ నారాయణమ్మ నాకిచ్చింది. ఇక్కడే రెక్కలు కట్టుకుని యెగురుతున్నాననిపిస్తోంది ... ఈ యెత్తు నించి చూస్తే మీ మేడ ఒక నరకంగా కనిపిస్తోంది ..." పెద్ద నిట్టూర్చి "హమ్మయ్య! ఎలాగో ఆ నరకం నించి బయటపడ్డాను."

ఇంటి విషయాల్లో యింత వివరణ యిదివరకెప్పుడూ వినని వాసు హఠాత్తుగా ప్రశ్నలు వెయ్యకుండా వూరుకోగానే గోపాలం మరి మాటాడలేదు. ఇన్నాళ్లు యింత విషాదాన్ని దాచిన నవ్వు యిప్పుడు గోపాలం ముఖంనించి తొలిగిపోయింది.

భోజనాలయ్యాయి. తరువాత

"ఇదిగోండి. మీ కోసం ... నారాయణమ్మ కోసం బట్టలు తెచ్చాను. ఇక్కడ కొన్నవి కావు" అని అందిచ్చాడు.

ఆ సిమ్మెంటు రంగు పువ్వుల నైలెక్సు చీర పట్టుకుని గోపాలం ప్రశ్నార్థకంగా చూసాడు.

"మా అక్కకు తెచ్చిన చీరల్లో ఒకటి అట్టిపెట్టాను. ఎవరికైనా యిద్దామని. దగ్గరి వాళ్లు యింకెవరున్నారు?" వెళ్లిపోతుంటే గోపాలం "మళ్లీ యెప్పుడొస్తా" వన్నాడు.

"నన్ను ఆలోచించనివ్వండి. అవసరమైతే వస్తాను" అని వెళ్లిపోయాడు.

★ ★ ★ ★

మరుచటి రోజు ఉదయం

"ఏమన్నాడురా?" అని తండ్రి అడిగితే

"ఏమంటారు? ఇల్లు వదిలేసాక తిరిగి రావటం అంత సులువా?

"అసలు యెందుకు వెళ్లిపోయాడో తెలుసుకున్నావా?"

"త్వరలో తెలుసుకుంటాంలెండి."

"ఆ మచ్చ యెలానూ వచ్చింది. పొరపాటు అయ్యే పోయింది. నా లోభం నన్నే తిన్నాది. సరే దాని మాటకేం గానీ ఎవరి ఖర్మ వారిది. నీ సంగతి తేల్చు"

"నా సంగతేమిటి?"

"నీ పెళ్లి?"

"నాకేం తొందర?"

"ఈ గొడబతో తొందరపడకపోతే యే సమయంలో యేమవౌతానన్న అధైర్యం వచ్చేసింది."

"ఇంత గొడబ యింట్లో జరిగాక నన్ను యింకా పిల్లనిస్తామని వస్తున్నారా? నేను నమ్మను"

"నివ్వు నమ్ము నమ్మకపో. పోటీల మీద వస్తున్నారు"

"మూడేళ్ల క్రితం యెవరూ పోటీ పడనిది యిప్పుడు పడతున్నారంటే యెలా నమ్మమంటారు?"

"ఇప్పుడు నీ విలువ బాగా పెరిగిపోయింది. పదేళ్లలో కోటీశ్వరుడవైపోవా? అందుకే బజారులో నీ విలువ లక్షల్లో వుంది.

"నేను తిరిగి వెళ్లటం లేదని వాళ్లకు తెలుసా?"

"ఏం? ఉద్యోగం పోయిందా? అందుకేనా తెలియపర్చకుండా వచ్చేసావు?"

"నీ మీద యేమైనా నేరాలు మోపారా ఉద్యోగంలో?"

"లేదు."



ఆచార్య తిరుమల

## "అక్షరాగ్ని"కి జ్యోతిర్మయి స్మారక అవార్డు

స్వర్గీయ జ్యోతిర్మయి పేరిట ఆమె భర్త కొంపెల్ల విశ్వం నెలకొల్పిన జ్యోతిర్మయి స్మారక అవార్డు ఆచార్య తిరుమల వచన కావ్యం 'అక్షరాగ్ని'కి లభించింది. నిర్ణీత గడువు లోగా వచ్చిన 143 కవితా సంపుటులను పరిశీలించిన న్యాయనిర్ణేతల సంఘం 'అక్షరాగ్ని'కి అవార్డును ఇవ్వాలని తీర్మానించింది. మే 17 వ తేదీ జ్యోతిర్మయి జన్మదినం రోజున మద్రాసులో ఆచార్య తిరుమల జ్యోతిర్మయి స్మారక అవార్డు పేరిట 1,116/– అందుకుంటారు.

## నెల్లూరులో ఉగాది కవితల పోటీ

నెల్లూరు టౌన్ జేసీస్ సింహపురి సాహితీ సమాఖ్య సంయుక్తంగా ఉగాదినాటి ఉదయం రాష్ట్రస్థాయి కవితల పోటీ నిర్వహించబడినది. వివిధ ప్రాంతాల నుండి 67 మంది కవులు పోటీలో పాల్గొన్నారు. కవితా గోష్ఠిలో 38 మంది కవులు తమ తమ కవితలు చదివి వినిపించారు.

ఆ సాయంత్రం జరిగిన సాహితీ సదస్సుకు సాహిత్య రత్న శ్రీ సి.సి. సుబ్బరాయుడు శ్రేటి అధ్యక్షత వహించగా, అభ్యుదయ కవి శ్రీ నాగభైరవ

## అవీ–ఇవీ–అన్నీ

కోటేశ్వరరావు ప్రధాన ఉపన్యాసకులుగా, ప్రముఖ కవి శ్రీ మోనా, ఇండియన్ బాంక్ మేనేజరు శ్రీ యస్.యస్.యస్. శర్మ వక్తలుగా, కళాప్రపూర్ణ మరుపూరు కోదండరామిరెడ్డి, డి.పి.ఆర్.ఓ. శ్రీ రత్నం, లాయర్, పత్రికా సంపాదకులు శ్రీ తుంగా రాజగోపాలరెడ్డిగార్లు సభను ఉద్దేశించి ఉపన్యసించారు. జేసీస్ అధ్యక్షులు శ్రీ జి. రాధాకృష్ణ, సమాఖ్య అధ్యక్షులు శ్రీ సి.హెచ్. రామూర్తిగార్లు కూడా వేదికను అలంకరించారు.

కవితల పోటీలలో ప్రథమ బహుమతి పొందిన శ్రీ ఎండ్లూరి సుధాకర్, ద్వితీయ బహుమతి పొందిన శ్రీ పరిమి ఐజాక్ ప్రవీణ్, తృతీయ బహుమతి పొందిన శ్రీ వి.ఆర్. గణపతి, ప్రత్యేక బహుమతులు పొందిన శ్రీయుతులు డి. గురురాజారావు, అల్లూరు ఉపేంద్రరెడ్డి, డా. ఈదూరు సుధాకర్, కన్సొలేషన్ బహుమతులు పొందిన శ్రీయుతులు పణిదపు వీరబ్రహ్మం, మునికేశవలరెడ్డి, వెసల లక్ష్మీకాంతారావు, గుంటూరి వెంకట రమణయ్య దుర్భా కమలాకరరావు గార్లకు శ్రీ నాగభైరవ నగదు బహుమతులతో పాటు షీల్డులు పంచిపెట్టారు. కార్యదర్శి జేసి బి. సుబ్బారావు స్వాగత సత్కారాలతో ప్రారంభమయిన ఈ కార్యక్రమం జేసి. పి. ప్రసాద్ వందన సమర్పణతో ముగిసింది.

## కళాసాగర్ వార్షికోత్సవం

ఏప్రిల్ నెల 20 వ తేదిన జరుగవలసి వున్న కళాసాగర్ 14వ వార్షికోత్సవాన్ని అనివార్య కారణాల చేత మే 11వ తేది నాటికి మార్చడమైనది. అందుచేత 12వ కళాసాగర్ ఫిలిం (క్రిటిక్స్) అవార్డ్స్ ఫంక్షన్ మద్రాసులోని మ్యూజిక్ అకాడెమి హాలులో మే 11వ తేది సాయంకాలం 6 గం.లకు జరుగుతుంది. ఈ ఉత్సవంలో శ్రీయుతులు శోభన్‌బాబు, సి. హెచ్. రామోజీరావు, మురళీమోహన్, విజయశాంతి, సుధాచంద్రన్, ఊర్వశి శారద, సుత్తివేలు, కోట శ్రీనివాసరావు, రమాప్రభ, ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం, పి. సుశీల మొదలగు సినీ ప్రముఖులు వేలాది నగర ప్రముఖుల సమక్షంలో కళాసాగర్ ఫిలిం అవార్డులను అందుకుంటారు. ☐



ఆంధ్రప్రదేశ్ స్పెషల్ కమిషనర్ ఏర్పాటు చేసిన అక్షయ ఉగాది ప్రత్యేక కార్యక్రమంలో పద్మశ్రీ రాధా రాజారెడ్డిగార్ల శిష్యురాలు కుమారి రాణి కౌసల్య కొత్త ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో చక్కటి కూచిపూడి నృత్య ప్రదర్శననిచ్చి పురప్రముఖుల, పార్లమెంటు సభ్యుల, ప్రేక్షకుల మన్ననలనందుకున్న సందర్భంగా తీసిన చిత్రం.

## బానిస బ్రతుకులు

"ఎవరితో నైనా జగడమాడావా?"

"లేదు"

"మరి యిక్కడుండి ఏం చేస్తావ్?"

"ఒక కిళ్లీ షాపు పెట్టుకుంటాను"

అదేం పనిరా? "అల్లుడలాగ చేసాడని సగం చచ్చాను. నువ్విలా చేస్తే మిగతా సగ ప్రాణం పూడుతుంది."

"అక్కడకు వెళ్లే ముందు డబ్బే సర్వస్వం అనుకున్నాను. అదే గౌరవం, సుఖం అన్నీ యిస్తుందనుకుని అంత తాపత్రయపడి వెళ్లాను. చిన్నప్పటినించీ చందమామను కోరినట్లు డబ్బునే కోరుకొనేటట్లు పెంచారు. ఈ పచ్చని భూమినించి ఆ చందమామ దగ్గరకెళ్తే గుట్టలే కనిపించాయి."

"ఈ నిరాశ యెందుకొచ్చిందో నాకేం అర్థంకాలేదు.

"ఎందుకా! అక్కడ మీరన్న డబ్బుకు విలువలేదు. ఆ డబ్బు నేను బానిసగా సంపాదించాను." "అంటే అక్కడ యెవరిల్లల్లో చాకిరీ చేసావురా?"

"కాదు ఉద్యోగమే చేసాను. ఉదాహరణకు ఒక చిన్న విషయం చెప్తున్నాను. అక్కడ ఒక రెస్టారెంటులో కుర్చీలో నేను కూర్చుని తింటుంటే ఆ దేశం మనిషి వస్తే నేను కుర్చీ ఖాళీ చేసి వాడికివ్వాలి. ఇవ్వకపోతే నా బతుకు హేయమైపోతుంది. నేను అక్కడ వాళ్ల డబ్బుతో కట్టి పెట్టేసిన బాండెడ్ లేబర్‌ని - బానిసను. ఆ బానిస బతుకు బతికేకన్నా నా దేశంలో కిల్లీషాపు పెట్టుకుంటే సుఖసంతోషాలతో హాయిగా వుంటాను."

తండ్రి తల పట్టుకుంటే అదంతా వింటున్న పావని తమ్ముని వేపు కొర కొర చూస్తుంటే, వాళ్ల వేపు నిదానంగా చూస్తూ "మన యిల్లు మేష్టారికి ఆ పరాయి దేశంలా అనిపించింది. ఇప్పుడున్న పాక అతనికి నేను పెట్టబోయే ఖిల్లీషాపు. మేష్టారు ఆ పాకలో స్వతంత్రంగా బతకడం నేర్పారు. ఇక యీ బానిస బ్రతుక్కి వచ్చే అవకాశంలేదు." అని వాసు అంటే యిద్దరూ తల దించేసారు.

(అయిపోయింది)

*Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3, Editor: S. Radhakrishna; Phones :- Business : 61247, 61248, Editorial : 75667*